సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం । 15 । ఆగస్టు । 2023

I



సోమశిలలో 21.526 టీఎంసీలు

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో సోమవారం సాయంత్రానికి 21.526 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 443 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,700
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,451
3 శాతం జీఎస్టీతో..	రూ.5,615
సవర (8 గ్రా)	రూ.44,920

గరిష్టం/కనిష్టం
37.2 /28.9

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 46 శాతం ఉంది. మంగళవారం జిల్లావ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

సెబ్ జిల్లా అధికారిగా దయాసాగర్



బాధ్యతలు స్వీకరిస్తున్న దయాసాగర్

నెల్లూరు సిటీ: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా అధికారిగా దయాసాగర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. నగరంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై నెల్లూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, ఇతర అధికారులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

డిజిటల్ పేమెంట్లపై ప్రత్యేక దృష్టి

- డీపీఓ సుస్మితారెడ్డి



టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు(పొగతోట): గ్రామ పంచాయతీల్లో డిజిటల్ పేమెంట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని డీపీఓ సుస్మితారెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి మండల, పంచాయతీ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో డీపీఓ మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ట్యాంకులను క్రమం తప్పకుండా శుభ్రం చేసి మంచినీటిని సరఫరా చేయాలన్నారు. తాగునీటి సరఫరా విషయంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మురుగునీరు నిల్వ ఉండకుండా, దోమలు వృద్ధి చెందకుండా దృష్టి సారించాలని తెలిపారు.

మహాశక్తి పేరుతో వ్యక్తిగత వివరాల సేకరణ



డీఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న కార్పొరేటర్లు

నెల్లూరు సిటీ: టీడీపీ నగర ఇన్‌చార్జి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ తరఫున 'మహాశక్తి' అనే కార్యక్రమం ద్వారా కొందరు ప్రైవేట్ వ్యక్తులు ఇంటింటికీ వెళ్లి మహిళల వ్యక్తిగత ఫోన్‌నంబర్లు, కుటుంబ వివరాలు సేకరిస్తున్నారని, మహిళల రక్షణకు వెంటనే చర్యలు తీసుకోవాలని నగర డీఎస్పీకి సోమవారం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఫిర్యాదు చేశారు. నారాయణ సంస్థల్లోని ఉద్యోగులు పార్టీ వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నారని ఆరోపించారు. మహిళల వివరాలు సేకరిస్తున్న వారిని విచారించి కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు గుంజి జయలక్ష్మి, షేక్ అస్మ, షేక్ సఫియాబేగం, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, వైఎస్సార్‌సీపీ నాయకురాలు మల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

- కలెక్టర్ హరినారాయణన్



అర్జీదారుల సమస్యను వింటున్న కలెక్టర్

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వచ్చే అర్జీలకు సంబంధించిన సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలోని తిక్కన ప్రాంగణంలో డీఆర్వో వెంకటనారాయణమ్మ, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డిలతో కలిసి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు కె.సాంబశివారెడ్డి, హేనాసుజన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీఈఓ గంగాభవాని, బీసీ సంక్షేమ అధికారి వెంకటయ్య, సాంఘిక సంక్షేమశాఖ అధికారి రమేష్, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, సర్వే ఏడీ హనుమాన్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటీటీకే ఓటు

ఒకప్పుడు కొత్త సినిమా రిలీజ్ అవుతుందంటే చాలు జనం టికెట్ల కోసం థియేటర్ల వద్ద నానా తంటాలు పడేవారు. క్యూలో నిలబడి ఎలాగోలా టికెట్లు దక్కించుకుని సినిమా చూసి సంతృప్తి చెందేవారు. ప్రస్తుతం సినిమా కోసం థియేటర్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంట్లోనే వీక్షించేలా ఓటీటీ ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి వచ్చాయి. ఫలితంగా థియేటర్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య తగ్గుతోంది.



సినిమా విడుదలైన వారాల్లోనే యాప్‌లో ప్రత్యక్షం

- అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్ తదితర ప్లాట్‌ఫాంలలో రిలీజ్
- థియేటర్‌కు వెళ్లి సినిమా చూసే వారి సంఖ్య తగ్గుతున్న వైనం
- ఇంట్లోనే కొత్త చిత్రాలను చూస్తున్న ప్రేక్షకులు
- ప్రత్యేక ప్యాకేజీలతో సబ్‌స్క్రిప్షన్



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: వెండితెరపై అలరారుతున్న సినిమా వైభవం నేడు నట్టింట్లోకి వచ్చేసింది. ఆధునికంగా ఓటీటీ ప్లాట్‌ఫాంలు ఇబ్బడిముబ్బడిగా అందుబాటులోకి రావడంతోపాటు ప్రత్యేక ప్యాకేజీలతో సబ్‌స్క్రిప్షన్లు ఆకర్షిస్తున్నాయి. పెద్ద హీరోల నుంచి చిన్న హీరోల వరకు, భారీ బడ్జెట్ నుంచి తక్కువ బడ్జెట్ వరకు కొన్ని సినిమాలు నేరుగా ఓటీటీల్లోనే విడుదలవుతుండగా, మరికొన్ని విడుదలైన వారం, పది రోజుల్లోనే ఓటీటీల్లో విడుదల చేస్తున్నారు. ఓటీటీల్లో హెచ్‌డీ క్వాలిటీ, డీటీఎస్‌తో సినిమాలు ప్రదర్శిస్తుండడంతో అరచేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్లు, ఫోన్‌తో అనుసంధానం చేసిన స్మార్ట్ టీవీల్లోనే కొత్త చిత్రాలను వీక్షిస్తూ ప్రజలు ఎంజాయ్ చేస్తున్నారు. ఇక మల్టీప్లెక్స్ థియేటర్లలో టికెట్ల ధరలు, పార్కింగ్ ఫీజు, స్నాక్స్ ధరలు పెరగడంతో సామాన్య ప్రేక్షకులు థియేటర్స్‌కు వెళ్లేందుకు ధైర్యం చేయలేని పరిస్థితి. భార్య, భర్త తమ పిల్లలతో కలిసి సరదాగా సినిమా చూసేందుకు రూ.1,500 నుంచి రూ.2 వేలు ఖర్చవుతోందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

జిల్లాలో పదుల సంఖ్యలో థియేటర్లు

ప్రస్తుతం జిల్లా పరిధిలోని నెల్లూరు, ఆత్మకూరు, కావలి మున్సిపాలిటీలతోపాటు బుచ్చిరెడ్డిపాళెం, కోవూరులలో మొత్తం 30 థియేటర్లు ఉన్నాయి. ఎస్2లో మూడు స్క్రీన్‌లు, ది సినిమాలో ఐదు స్క్రీన్‌లు, రెయిన్‌లో నాలుగు స్క్రీన్‌లు, లీలామహల్‌లో ఒకటి, సిరి థియేటర్లలో నాలుగు స్క్రీన్‌లు ఉన్నాయి. ఒక్క నెల్లూరు మినహా మిగతా ప్రాంతాల్లో ఏసీ, నాన్ ఏసీ థియేటర్లే ఉన్నాయి. ఇక బిట్రగుంట, రాజుపాళెంలలో థియేటర్లు మూతపడ్డాయి. కొన్నిచోట్ల సినిమా థియేటర్లు కల్యాణ మండపాలుగా మారితే.. మరికొన్ని గోడౌన్లుగా కూడా మారాయి.

వెబ్‌సిరీస్‌లకు ప్రాధాన్యం

వెండితెరపై స్టార్ హీరోలు, హీరోయిన్లుగా వెలుగొందిన వారందరూ ప్రేక్షకుల ఆదరణ కోసం వెబ్ సిరీస్‌లలో హల్‌చల్ చేస్తున్నారు. ప్రత్యేకించి కొన్ని టీవీ చానళ్లు వీటిని రూపొందిస్తుంటే.. మరికొన్ని ఓటీటీ ప్లాట్‌ఫాంలు వేదికగా మార్చుకుని తమ ప్లాట్‌ఫాంల రేటింగ్‌ను పెంచుకునేందుకు పోటీపడుతున్నాయి. దీంతో స్టార్‌డమ్ ఉన్న నటీనటులు సైతం స్పెషల్ ప్రోగ్రామ్స్ పేరుతో వెబ్‌సిరీస్‌లలో అతిథి పాత్రలు పోషిస్తున్నారు. ఓటీటీ ప్లాట్‌ఫాంలు సైతం ప్రేక్షకుల ఆదరణ కోసం సినిమా, సీరియల్స్‌ను తలపించే రీతిలో సందేశాత్మకమైన సిరీస్‌లు రూపొందిస్తున్నాయి. అలాగే అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, హాట్‌స్టార్ తదితర స్ట్రీమింగ్‌లలో ప్రత్యేక సీరియల్స్‌ను విడుదల చేస్తున్నారు. అలాగే కొన్ని స్ట్రీమింగ్‌లలో క్రికెట్ లైవ్ వీడియో చూసే అవకాశం కల్పించారు.

ఐదుగురు యూజర్లు చూసే అవకాశం

ఓటీటీ స్ట్రీమింగ్‌లను ఆన్‌లైన్‌లో నెల, ఏడాది ప్యాకేజీల కింద రెంట్ చెల్లించిన తర్వాత ఐడీ, పాస్‌వర్డ్ ఇస్తారు. ఐదుగురు వరకు ఐడీ, పాస్‌వర్డ్‌ను వినియోగించుకోవచ్చు. బయటకు వెళ్లినప్పుడు తమ సెల్‌లో కూడా సినిమాలు, కార్యక్రమాలు, సీరియల్స్, క్రికెట్ చూసేందుకు అవకాశం కల్పించారు. దీంతో కుటుంబసభ్యులు తమ సెల్‌లో కూడా స్ట్రీమింగ్ చేసుకుని వినియోగించుకునే అవకాశం కలిగింది.

ఇంట్లోనే చూసే అవకాశం

ప్రస్తుతం ప్రేక్షకులకు నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్, హాట్‌స్టార్, జీ మూవీస్, సన్‌నెక్ట్స్, తదితర స్ట్రీమింగ్‌లలో కొత్త సినిమాలు చూసే అవకాశం లభించింది. కొత్త సినిమా విడుదలైన 20 నుంచి 30 రోజుల్లో ఇంట్లోనే కుటుంబ సమేతంగా వీక్షించేందుకు ఆయా కంపెనీలు నెల రోజులు, ఏడాది ప్యాకేజీలు ప్రేక్షకులకు అందుబాటు ధరలకు అందిస్తున్నాయి. కుటుంబ సమేతంగా ఒక సినిమాకు వెళ్లాలంటే రూ.2 వేల వరకు ఖర్చవుతున్న నేపథ్యంలో ఏడాదికి రూ.2 వేలు ఖర్చు చేస్తే చాలు విడుదలైన ప్రతి కొత్త సినిమాను కుటుంబంతో కలిసి ఇంట్లోనే చూసే అవకాశాన్ని కల్పిస్తుండడంతో ప్రేక్షకులు థియేటర్లకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. అయితే ఇంట్లో వైఫై ఇంటర్నెట్ కనెక్షన్ తప్పనిసరిగా ఉండాలి.

ఓటీటీ కారణంగా నష్టపోతున్నాం

ఓటీటీ కారణంగా డిస్ట్రిబ్యూటర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. చిత్రం విడుదలైన రెండు వారాలకే ఓటీటీ విడుదల తేదీలను ప్రకటించడంతో ప్రేక్షకులు థియేటర్లకు రావడం లేదు. ఓటీటీలో చూడవచ్చని ఆగిపోతున్నారు. యువత మాత్రమే చిత్రం విడుదలైన మూడు, నాలుగు రోజులు వస్తున్నారు. కుటుంబసమేతంగా థియేటర్స్‌కు వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది.

– భాస్కర్‌రెడ్డి, డిస్ట్రిబ్యూటర్

థియేటర్‌కు వెళ్తే రూ.2 వేలకుపైగా ఖర్చు



భార్య, భర్త, పిల్లలు సినిమా చూసేందుకు థియేటర్‌కు వెళ్తే దాదాపుగా రూ.2 వేల ఖర్చవుతోంది. టికెట్ ధరలు కూడా అధికంగా ఉన్నాయి. ఇంకా స్నాక్స్ అయితే టికెట్ ధరలకు మించి రెండింతలు అవుతున్నాయి. థియేటర్లలో విడుదలైన కొత్త సినిమాలు వారం, పది రోజుల్లో ఓటీటీల్లో వచ్చేస్తున్నాయి.

– ప్రసన్నకుమార్‌రెడ్డి, ప్రైవేట్ ఉద్యోగి

సెల్‌ఫోన్‌లోనే చూస్తున్నాం



గతంలో సెలవు దొరికితే సినిమా చూసేందుకు థియేటర్‌కు వెళ్లేవాళ్లం. ఇప్పుడు అంత అవసరం లేదు. ఇంట్లో ఇంటర్నెట్ ఉంటే చాలు ఓటీటీలో విడుదలయ్యే కొత్త సినిమాలు, వెబ్‌సిరీస్‌లు సెల్‌ఫోన్లు, టీవీల ద్వారా చూస్తున్నాం. టీవీ సీరియల్స్ చూడకపోయినా మళ్లీ ఓటీటీలో చూస్తున్నారు. తక్కువ ఖర్చుతోనే వినోదాన్ని ఆస్వాదిస్తున్నాం.

– ఎస్‌డీ సాజిద్, ఉద్యోగి, నెల్లూరు

పకడ్బందీగా స్వాతంత్య్ర వేడుకలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కలెక్టర్ హరినారాయణన్ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి, నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్‌లతో కలిసి స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్య్ర వేడుకల్లో ప్రొటోకాల్ అనుసరించి సీటింగ్, స్టేజ్ ఏర్పాట్లు, తాగునీటి సరఫరా, పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాట్లను పటిష్టంగా చేయాలని అధికారులను ఆదేశించారు. స్వాతంత్య్ర వేడుకలను పురస్కరించుకుని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రసంగం ఉంటుందని, అందుకోసం స్టేజ్ అలంకరణ, నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. సీటింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు హిమవతి, శ్రీనివాసరావు, ఆర్డీఓ మలోల, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీటీసీ చందర్, డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు సాంబశివారెడ్డి, వెంకట్రావు, నాగరాజు, డీఈఓ గంగాభవాని, ఆర్‌డబ్ల్యూఎస్, మున్సిపల్ ఎస్‌ఈలు రంగవరప్రసాద్, సంపత్‌కుమార్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి సుధాకర్‌రాజు, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి, నెల్లూరు అర్బన్, రూరల్ తహసీల్దార్లు నిర్మలానందబాబా, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీని సమర్థవంతంగా అమలు చేయాలి

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీని సమర్థవంతంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలపై సోమవారం కలెక్టర్ చాంబర్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు.

కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు



కవాతును పరిశీలిస్తున్న ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

నెల్లూరు సిటీ: స్వాతంత్య్ర దినోత్సవ వేడుకలకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. నగరంలోని పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో సోమవారం స్వాతంత్య్ర వేడుకల కవాతు, వీవీఐపీ భద్రత రిహార్సల్స్‌ను ఎస్పీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం జరిగే స్వాతంత్య్ర వేడుకలకు విచ్చేసే ముఖ్యఅతిథులకు గౌరవ వందనం విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఉగ్రవాదుల నుంచి వీవీఐపీని రక్షించేలా స్పెషల్ పార్టీ సిబ్బంది చేసిన విన్యాసాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరినీ డీఎఫ్ఎండీ ద్వారా తనిఖీ చేసి పంపాలన్నారు. వాహనాల పార్కింగ్ నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు.



500 మీటర్ల భారీ జాతీయజెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

భారతీయులంతా ఒక్కటే

- జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): భారతీయులంతా ఒక్కటేనని, దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా నాభూమి – నాదేశం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ తెలిపారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా సోమవారం నగరంలో 500 మీటర్ల భారీ జాతీయజెండాను జెడ్పీ చైర్‌పర్సన్ ఆవిష్కరించి అనంతరం వీఆర్సీసెంటర్ నుంచి గాంధీబొమ్మ వరకు ప్రదర్శన నిర్వహించారు. కృష్ణచైతన్య కళాశాల విద్యార్థులు వందేమాతరం–మాదే ఈ తరం, ఎర్రకోటలో ఎగిరిన జెండా– ఎదురే లేదని చాటిన జెండా వంటి నినాదాలతో కదంతొక్కారు. ర్యాలీ ముందువైపు భారతమాత, మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్, అంబేడ్కర్ తదితర స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలతో చిన్నారులు అలరించారు. తొలుత వీఆర్సీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి, గాంధీబొమ్మ సెంటర్‌లో మహాత్మాగాంధీ విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతావని బ్రిటిష్ దాస్యశృంఖలాల నుండి విముక్తి పొంది 76 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా భారతీయులందరూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, హర్ ఘర్ తిరంగా లాంటి కార్యక్రమాలు చేపట్టి దేశ ఐక్యతను ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. అలాగే నాభూమి – నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల్లో స్ఫూర్తినింపామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు భారతదేశ ఔన్నత్యాన్ని తెలిపి వారిలో దేశభక్తిని పెంపొందించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ సుస్మితారెడ్డి, డ్వామా పీడీ వెంకట్రావు, బీసీ సంక్షేమశాఖ అధికారి వెంకటయ్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో చిన్నారులు

క్లుప్తంగా

రెవెన్యూ విభాగానికి సేవా పురస్కారాలు

నెల్లూరు(దర్గామిట్ట): స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా రెవెన్యూ విభాగంలో విధి నిర్వహణలో ప్రతిభకనబర్చిన 500 మందికి పైగా అధికారులు, సిబ్బంది సేవా పురస్కారాలకు ఎంపిక చేశారు. నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్, కందుకూరు సబ్‌కలెక్టర్ ఎస్ శోభిక, జెడ్పీ సీఈఓ బీ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ ఎస్ గంగాభవానీ, కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సంపత్‌కుమార్, తదితరులు సేవాపురస్కారాలకు ఎంపికయ్యారు. నెల్లూరులోని పోలీసు పరేడ్ గ్రౌండ్స్‌లో కలెక్టర్ హరినారాయణన్ అధ్యక్షతన మంగళవారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు పురస్కారాలు అందజేయనున్నారు.

పోలీసు శాఖలో...

నెల్లూరు సిటీ: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పలువురు పోలీసు అధికారులు ఉత్తమ సేవాపురస్కారాలకు ఎంపికయ్యారు. ఏఆర్ డీఎస్పీ జీ మహాత్మ గాంధీ, కంట్రోల్ రూము సీఐ షఫీ అహ్మద్, నెల్లూరు రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్సై మస్తానయ్య, ఇందుకూరుపేట ఏఎస్సై బాలకోటయ్య, ఏఆర్ ఎస్సై ఎస్‌డీ హబీబ్‌బాషా, డీసీఆర్‌బీ హెడ్‌కానిస్టేబుల్ వెంకట రాఘవ, జలదంకి కానిస్టేబుల్ ఎస్ పిచ్చిరెడ్డి, ఏఆర్ ఎస్సై మహబూబ్‌బాషా, ఏఆర్ కానిస్టేబుల్ రామచంద్రశేఖర్ పురస్కారాలు అందుకోనున్నారు. సెబ్ విభాగంలో ఇంటెలిజెన్స్ టీం సీఐ హుస్సేన్‌బాషా, నెల్లూరు-1,2 ఇన్‌స్పెక్టర్లు కిషోర్, వీ వెంకటేశ్వరరావు, కావలి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్‌రావు, కందుకూరు ఇన్‌స్పెక్టర్ డీ వెంకటేశ్వర్లు, జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీఎం ఎస్సై బాలకృష్ణ, బుచ్చిరెడ్డిపాళెం సెబ్ ఎస్సై అంజయ్య, కానిస్టేబుల్ బీ సురేష్ పురస్కారాలకు ఎంపికయ్యారు.

నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి

నెల్లూరు(పొగతోట): జిల్లాలో ఖాళీగా ఉన్న రెండు సర్పంచ్‌లు, 63 వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసహరణ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. పోలింగ్ అవసరమైన వార్డుల్లో ఈ నెల 19న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ప్రక్రియ నిర్వహించనున్నారు. సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారుల హవా కొనసాగింది. ఆత్మకూరు మండలం చెర్లోయడవల్లి సర్పంచ్ పదవి ఏకగ్రీవమైంది. జలదంకి మండలం లింగరాజుఅగ్రహారం సర్పంచ్ పదవికి పోలింగ్ నిర్వహించనున్నారు. 63 వార్డులకు గానూ 49 వార్డులు ఏకగ్రీవమయ్యాయి. అల్లూరు మండలంలోని ఇస్కపల్లి పంచాయతీలో రెండు వార్డులకు నామినేషన్లు వేయలేదు. మిగిలిన 12 వార్డులకు పోలింగ్ నిర్వహించనున్నారు. కాగా సర్వేపల్లి నియోజకవర్గంలో 3 వార్డులు మినహా అన్ని వార్డులు ఏకగ్రీమయ్యాయి.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం



రెవెన్యూ సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలతో రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూసమస్యలకు పరిష్కారం లభించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో మంత్రి కాకాణి పాల్గొన్నారు. రెవెన్యూ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. తిక్కవరప్పాడు, సర్వేపల్లి, కంటేపల్లి, తదితర గ్రామాల రైతులు అందజేయగా వెంటనే పరిష్కరించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అనంతరం మంత్రి కాకాణి విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం చూపడంతో పేద రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. 20 ఏళ్లుగా భూములను అనుభవిస్తున్న రైతులకు హక్కులు కల్పిస్తున్నామని, సీజేఎఫ్ఎస్ భూములకు డీకేటీ పట్టాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలోని భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు జగనన్న శాశ్వత భూ హక్కు- భూ రక్ష పథకం కింద రీ సర్వే చేయిస్తున్నారని వివరించారు. చంద్రబాబు పాలనలో రెవెన్యూ సమస్యలతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగేవారని గుర్తుచేశారు. ప్రస్తుతం జగనన్నకు చెబుదాం ద్వారా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని తెలిపారు. కలెక్టర్ ఎం హరినారాయణన్ రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడంతో సత్ఫలితాలు వస్తున్నాయన్నారు. సెప్టెంబరు నెలాఖరులోగా సర్వేపల్లి నియోజకవర్గంలోని రెవెన్యూ సమస్యలను పూర్తిగా పరిష్కరించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ రమేష్, ఎంపీపీ మందా కవిత, వైస్‌ఎంపీపీలు కనుపూరు కోదండరామిరెడ్డి, పచ్చబట్ల మస్తానయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికారప్రతినిధి మందల వెంకటశేషయ్య, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్రకార్యదర్శి కోడూరు ప్రదీప్‌కుమార్ రెడ్డి, ఎంపీటీసీ వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, ఆరుగుంట ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలు హాస్యాస్పదం



51వ డివిజన్‌లో పర్యటిస్తున్న నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్

- నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కేంద్రంతో మాట్లాడి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆటాడిస్తానని పవన్ కళ్యాణ్ విశాఖపట్నంలో చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని 51వ డివిజన్‌లోని రచ్చమానువారివీధి, వాదనల వారివీధి, బందీలవారి సందు, తదితర ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోనియాగాంధీని చూసి ప్రతిఒక్కరూ బయపడే రోజుల్లోనే ఆమెను ఎదుర్కొన్న వ్యక్తి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, అలాంటి జగనన్నను ఎంత మంది కలిసి వచ్చినా ఏమీ చేయలేరని అన్నారు. కట్టకట్టుకుని వచ్చే బ్యాచ్‌ను ప్రజలు తిరస్కరించే రోజును 2024లో చూస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని తెలిపారు. ఈ మధ్యన టీడీపీ నాయకులు మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా స్టిక్కర్లు అంటిస్తూ సమావేశాలు పెట్టడం చూస్తున్నామన్నారు. టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న ఓ రౌడీషీటర్ మూడ్రోజుల క్రితం సంతపేటకు చెందిన ఓ మహిళను అతిదారుణంగా పొడిచారని తెలిపారు. ఈ విషయమై మహిళా శక్తి పేరుతో కార్యక్రమాలు చేస్తున్న టీడీపీ నాయకులు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. 2014 నుంచి 2019 వరకు గత ప్రభుత్వం దాడులు, కక్ష సాధింపులకు పాల్పడిందన్నారు. 2019లో తమ ప్రభుత్వం వచ్చిన తరువాత కక్ష సాధింపులు చేసుంటే నెల్లూరులో నారాయణ స్కూల్ ఉండేది కాదన్నారు. గత ప్రభుత్వంలో తనపై అనవసరమైన కేసులు పెట్టి భ్రష్టుపట్టించారన్నారు. కానీ తమ ప్రభుత్వం వచ్చాక తానెప్పుడూ అలాంటి దిగజారుడు రాజకీయాలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్‌అహ్మద్, కార్పొరేటర్ కాయల సాహిత, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన జూడో పోటీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని కొండాయపాళెంలో ఇన్‌ఫాంట్ జీసస్ స్కూల్ క్రీడా ప్రాంగణంలో రెండ్రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి పురుషుల, మహిళల జూడో పోటీల్లో అనంతపురం జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించింది. సోమవారం జరిగిన ఫైనల్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో అనంతపురం ప్రథమస్థానం, చిత్తూరు ద్వితీయస్థానంలో నిలిచాయి. సీనియర్స్ విభాగంలో అనంతపురం ప్రథమ స్థానం, కాకినాడ ద్వితీయస్థానంలో నిలిచాయి. వెంకటగిరి ఎమ్మెల్యే, జిల్లా జూడో అసోసియేషన్ చైర్మన్ ఆనం రామనారాయణరెడ్డి విజేతలకు షీల్డ్‌లు ప్రదానం చేశారు.

డీఎంహెచ్‌ఓ ఆఫీసులో దొంగలు పడ్డారు!

నెల్లూరు(బారకాసు): నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో దొంగలు పడిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శని, ఆదివారాలు సెలవులు కావడంతో గుర్తుతెలియని వ్యక్తులు కార్యాలయంలోకి చొరబడ్డారు. డీఎల్ ఏటీఓ విభాగం ఛాంబర్ తాళం పగులగొట్టి వేరే తాళం వేశారు. కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన గతంలో పనిచేసిన అధికారుల పేర్లు ఉన్న బోర్డును తొలగించారు. సోమవారం యథావిధిగా విధులకు వచ్చిన ఆ విభాగాధిపతి గుర్తించి డీఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్యకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై డీఎంహెచ్‌ఓను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా డీఎల్‌టీఓ ఛాంబర్‌కు వేసిన తాళం కీ పోవడంతో దాన్ని పగులగొట్టించి వేరే తాళం వేశామని తెలిపారు.

నాలుగేళ్లుగా అజ్ఞాతంలో బాబు, పవన్



పార్టీలో చేరిన వారితో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం: నాలుగేళ్లుగా అజ్ఞాతంలో ఉన్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు ఎన్నికలు దగ్గర పడడంతో ఇప్పుడు ప్రజలు గుర్తుకొచ్చారా అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని ఇస్కపాళెం పంచాయతీ పరిధిలోని రాయలసీమకు చెందిన బాధిత కుటుంబాలకు ఎన్ఎస్సార్ ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రసన్న రూ.3.75లక్షల సాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసన్న విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో ఓడించాలంటే ఒంటరిగా పోరాడలేమని తెలుసుకున్న టీడీపీ, జనసేన పొత్తుల కోసం ఆరాటపడుతున్నాయని విమర్శించారు. ఒక వేళ టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకుంటే ముఖ్యమంత్రి అభ్యర్థిత్వంపై వారికే స్పష్టత లేదన్నారు. స్పష్టతలేని ప్రతిపక్షాలు ప్రస్తుతం ప్రజాక్షేత్రంలోకి వచ్చి సీఎం వైఎస్ జగన్‌తో పాటు ఆయన కుటుంబసభ్యులు, పోలీసులను ఇష్టానుసారంగా దూషిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని విమర్శలు చేసినా, ఎన్ని అబద్ధాలు చెప్పినా కూడా ప్రజలు వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంను చేసుకోవాలని నిర్ణయం తీసేసుకున్నారని గుర్తుచేశారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

వడ్డిపాళెనికి చెందిన దాదాపు 50 మంది టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు చెర్లో సతీష్‌రెడ్డి, టంగుటూరు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు కోడూరు మధుసూదన్ రెడ్డి, కావలి వెంకటేశ్వర్లు, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, మోర్ల మురళి, నరసింహులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో పారదర్శక పాలన



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిపాలనలో ప్రజల భాగస్వామ్యానికి, పారదర్శకతకు పెద్దపీట వేసినట్లు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బోగోలు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేకుండా ప్రజలకు ఇంటి వద్దే అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశామని తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టిన తరువాత కార్యాలయాలకు వచ్చే అర్జీదారుల సంఖ్య భారీగా తగ్గిందన్నారు. సీఎం వైఎస్ జగన్ ప్రజాసమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమిస్తూ గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కరించే దిశగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా అర్జీదారుల సమస్యలు గ్రామ, వార్డు స్థాయిలోనే పరిష్కారమవుతున్నట్లు వివరించారు. మహాత్మా గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం సాధన దిశగా సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయన్నారు. తహసీల్దార్ హేమంత్, ఎంపీడీఓ సుబ్బారావు, ఎంపీపీ మేకల సుజాత, జెడ్పీటీసీ మద్దిబోయిన కీర్తన, నాగులవరం పీఏసీఎస్ అధ్యక్షుడు సుంకే మాల్యాద్రి, పార్టీ నాయకులు మద్దిబోయిన వీరరఘు, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరు (కిలో)
పెద్దవి: రూ.45
సన్నవి: రూ.20
పండ్లు: రూ. 8

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్	రూ.144
లేయర్	రూ.92
బ్రాయిలర్ చికెన్	రూ.250
స్కిన్‌లెస్ చికెన్	రూ.274
లేయర్ చికెన్	రూ.156

మౌలిక వసతుల కల్పనకు కృషి



బుక్‌లెట్లు అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

కలిగిరి: గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కృష్ణారెడ్డిపాళెం పంచాయతీ పరిధిలోని రాజుపాళెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం ఆయన నిర్వహించారు. తొలుత గ్రామ సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు. అనంతరం గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తోందని తెలిపారు. ఈ నిధులతో ప్రజలకు అత్యావసరమైన మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రాజుపాళెం బీసీ కాలనీలోని విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమ పాలన కోసం రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ కాటం రవీంద్రారెడ్డి, సర్పంచ్ నలతాటి మహాలక్ష్మమ్మ, పీఏసీఎస్ చైర్మన్ ములకా శ్రీనివాసులురెడ్డి, బొల్లినేని వెంకటసత్యానారాయణ, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు ఆపరేటర్ హత్య కేసులో నిందితుల అరెస్ట్

- ప్రియుడితో కలిసి ఘాతుకానికి పాల్పడిన భార్య



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కోటారెడ్డి

ఆత్మకూరు: పట్టణంలో శనివారం అర్ధరాత్రి జరిగిన రైస్ మిల్లు ఆపరేటర్ దేవరింటి సత్యం (45) హత్య కేసును పోలీసులు ఛేదించారు. ప్రియుడితో కలిసి భార్యే ఘాతుకానికి పాల్పడినట్లుగా పోలీసుల విచారణలో తేలింది. దీంతో నిందితులను అరెస్ట్ చేశారు. పట్టణంలోని సర్కిల్ కార్యాలయంలో సోమవారం రాత్రి డీఎస్పీ కోటారెడ్డి విలేకరులకు నిందితుల వివరాలను వెల్లడించారు. ప్రకాశం జిల్లా ఒంగోలులోని అరవపాళెం ప్రాంతానికి చెందిన దేవరింటి సత్యం, లక్ష్మీదేవి దంపతులు. 9ఏళ్ల క్రితం వారు ఉపాధి నిమిత్తం మర్రిపాడు మండలం డీసీపల్లికి వలస వచ్చారు. అనంతరం సత్యం ఆత్మకూరులోని తూర్పువీధిలోని రైస్‌మిల్లులో ఆపరేటర్‌గా చేరాడు. లక్ష్మీదేవి బేల్దారి పనులకు వెళ్తుండేది. ఆమెకు ఏడాది క్రితం సెంట్రింగ్ పని చేసే ఆత్మకూరుకు చెందిన షేక్ అక్బర్‌తో పరిచయమైంది. అది కాస్తా అక్రమ సంబంధానికి దారితీసింది. ఈ విషయం తెలుసుకున్న సత్యం పలుమార్లు వారిని మందలించాడు. ఈ క్రమంలో అక్బర్ ఓ రోజు నిన్ను చంపితే మా సంబంధానికి అడ్డులేకుండా పోతుందని సత్యంను బెదిరించాడు. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో రైస్‌మిల్లు సమీపంలోని ఇంటి వద్ద ఆరుబయట నిద్రిస్తున్న సత్యంను అక్బర్ కత్తితో పొడవగా, భార్య లక్ష్మీదేవి రోకలిబండతో తీవ్రంగా గాయపరిచింది. దీంతో సత్యం మృతి చెందాడు. మృతుడి సోదరుడు నవీన్, కుమారుడు ప్రతాప్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. సోమవారం మధ్యాహ్నం బొగ్గేరు సమీపంలోని బ్రిడ్జి వద్ద నిందితులు ఉండగా అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కాగా ఒక్కరోజు వ్యవధిలోనే కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన డీఎస్పీతో పాటు సీఐ జీ వేణు, ఎస్సైలు ముత్యాలరావు, రాజేష్, సాయిప్రసాద్‌ను ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

నెల్లూరు(లీగల్): మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదన్న కక్షతో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశాడని నమోదైన కేసులో సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో నిందితుడు దుగ్గబోయిన సాయిశివకుమార్‌కు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ ఐదో అదనపు ఇన్‌చార్జి జిల్లా జడ్జి తేజోవతి సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసులో రెండో నిందితుడు రఘుఅరవింద్‌పై నేరం రుజువు కాకపోవడంతో కేసును కొట్టివేశారు. వివరాలు.. గూడూరు మండలం దివిపాళెం పంచాయతీ చవటపాళేనికి చెందిన నిందితుడు సాయిశివకుమార్, హతుడు విశ్రాంత రైల్వే ఉద్యోగి తిరుమలశెట్టి జయరామయ్య స్నేహంగా ఉంటూ నిత్యం గ్రామ సమీపంలోని మద్యం దుకాణంలో తాగేవారు. ఈ నేపథ్యంలో 2018 నవంబర్ 14న రాత్రి 10.30గంటల సమయంలో సాయిశివకుమార్ మద్యం దుకాణం వద్ద మద్యం సేవించి అక్కడకొచ్చిన జయరామయ్యను నగదు అడగగా తిరస్కరించాడు. దీంతో ఆగ్రహించిన సాయిశివకుమార్, మరో నిందితుడు రఘుఅరవింద్‌తో కలిసి జయరామయ్యను బలవంతంగా సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లారు. అనంతరం సాయిశివకుమార్ కత్తితో జయరామయ్యను పొడిచి హతమార్చి పరారయ్యాడు. మరుసటిరోజు ఉదయం జయరామయ్య మృతదేహాన్ని గుర్తించిన కుమారుడు తిరుమలశెట్టి రమేష్ గూడూరు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులు సాయిశివకుమార్, రఘుఅరవింద్‌పై కేసు నమోదు చేశారు. విచారణానంతరం కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టులో విచారణ అనంతరం న్యాయమూర్తి పైమేర తీర్పు చెప్పారు. ఈ కేసును అప్పటి గూడూరు పట్టణ డీఎస్పీ వీ రాంబాబు దర్యాప్తు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆర్ జగదీష్ వాదించారు.

ఆగస్టు 15

ఆమె... దేశంలో సగం ఎప్పుడు!?

స్వాతంత్ర్య దినోత్సవం దేశ ఔన్నత్యాన్ని మాట్లాడుతుంది. దేశ ఉజ్వల భవిష్యత్తును కాంక్షిస్తుంది. కాని దేశంలో సగమైన స్త్రీలు సంపూర్ణ స్వాతంత్ర్య ఫలాలు ఇంకా పొందవలసే వుంది. ఏనాడైతే స్త్రీల పట్ల సురక్షితమైన, సంస్కారవంతమైన ప్రవర్తనను ఈ సమాజం చూపుతుందో అప్పుడే స్త్రీలకు సంపూర్ణ స్వాతంత్ర్యం వచ్చినట్టు. అప్పుడే దేశ ఔన్నత్యం ఇనుమడించినట్టు. 'ఆకాశంలో సగం'లాగా దేశంలో సగం ఇంకెప్పుడు?



నేడు ఆగస్టు 15న ఎర్రకోట మీద జెండా ఎగుర వేసే సమయంలో ప్రధాని నరేంద్ర మోడీకి ఇద్దరు మహిళా ఆర్మీ ఆఫీసర్లు సహకారం అందిస్తారు. మేజర్ నికితా నాయర్, మేజర్ జాస్మిన్ కౌర్ పతాకావిష్కరణ సమయంలో ప్రధానితో పాటుగా ఉండి జెండా వందనం సమర్పిస్తారు. ఈ విశేష ఘట్టంలో ఇద్దరు మహిళలకు ఈ విధంగా చోటు దక్కడం సంతోషపడాల్సిన సంగతి. 76 ఏళ్ల క్రితం స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి నేటి వరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన పురోభివృద్ధికి ఇదీ ఒక సంకేతమే. నాటి నుంచి నేటి వరకు విద్య, ఉపాధి, ఉద్యోగం, సైన్యం, పాలనా యంత్రాంగం, శాసన వ్యవస్థ... వీటిల్లో స్త్రీలకు గణనీయంగా స్థానం దక్కింది. ప్రాముఖ్యం లభించింది. అయితే అంతమాత్రాన స్త్రీలు సంపూర్ణంగా స్వాతంత్ర్య ఫలాలు అనుభవిస్తున్నారా అనేది ప్రశ్న.

స్త్రీల త్యాగం

దాస్య భారతంలో జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో స్త్రీలు పాల్గొన్నారు. అన్నింటికి మించి పురుషులు దేశం కోసం ప్రాణాలు అర్పించినా, జైళ్ల పాలైనా స్త్రీలు ధైర్యంగా ఇళ్లు నడిపి కష్టాలను ఈదారు. దేశ విభజన సమయంలో తీవ్ర హింసను ఎదుర్కొన్నారు. అంతెందుకు 1930 నాటికి దేశ వ్యాప్తంగా 30 వేల మంది స్త్రీలు స్వాతంత్ర్య పోరాటంలో ఏదో విధాన జైలు శిక్ష అనుభవిస్తున్నారని తెలిస్తే ఆశ్చర్యం వేస్తుంది. ఈ స్త్రీల పోరాటం చాలామటుకు చరిత్రలో నమోదు కాకుండానే కాలగర్భంలో కలిసిపోయింది. ఇప్పుడిప్పుడే నాటి వీర వనితల గాథలు వెలికి వస్తున్నాయి. ఇంత పోరాటం, త్యాగం చేసి స్త్రీల భాగస్వామ్యంతో తెచ్చుకున్న స్వాతంత్ర్యంలో స్త్రీలు నిజంగా సంతోషంగా ఉన్నారా?

సురక్షితం కాని దేశం

'ఒక స్త్రీ అర్ధరాత్రి క్షేమంగా నడిచి వెళ్లినప్పుడే ఈ దేశానికి నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్టు' అని గాంధీజీ ఏ ముహూర్తంలో అన్నారో కాని అలాంటి స్థితి నేటికీ రాకపోగా నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. ఎన్ని చట్టాలు చేసినా, శిక్షలు తెచ్చినా స్త్రీలను గౌరవించాలి, వారి ఆత్మగౌరవాన్ని కాపాడాలి అని మెజారిటీ సమాజం అనుకోవడం లేదు. 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అనే భావన సమాజంలో ఆది కాలం నుంచి చొప్పించి ఉండటం వల్ల స్త్రీ చేసే ప్రతి పనిలో తప్పు ఎంచడం, అదుపు చేయడం, చులకనగా చూడటం, వివక్ష చూపడం, దండించడం ఆనవాయితీగా మారింది. పిల్లల పెంపకం దశ నుంచే స్త్రీలను గౌరవించడం నేర్పించడం లేదు. ఇంట్లో అమ్మాయిని ఒకలాగా, అబ్బాయిని ఒకలాగా పెంచడం వల్ల ఈ అబ్బాయిలు 'సమాజం'గా మారి స్త్రీ పాలిట బెడదగా మారుతున్నారు. తమ మాటకు ఎటువంటి తిరస్కారం చెప్పినా పురుషుడు శిక్షించేవాడై స్త్రీని చంపేందుకు వెనుకాడటం లేదు. స్త్రీకి ఒక అభిప్రాయం కలిగి ఉండే స్వాతంత్ర్యం ఆమెకు ఎందుకు ఇవ్వడం లేదు?

స్త్రీలను ప్రేమ, మర్యాద, గౌరవాలతో కుటుంబం చూసుకోవాలి. అప్పుడు ఆ మర్యాద, గౌరవాలు సమాజంలోకి ఆటోమేటిక్‌గా వస్తాయి. కుటుంబం స్త్రీకి ఎలా రక్షణ ఇస్తుందో సమాజం కూడా స్త్రీకి అలా రక్షణ ఇవ్వాలనే పౌర శిక్షణ, సంస్కారం అవసరం. పురుషులు మాత్రమే కాదు స్త్రీలు కూడా కుటుంబం, సమాజం, దేశం కోసం గొప్పగా ఆలోచించగలరు. వారికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చి చూస్తే తెలుస్తుంది. అటువంటి వేకువలోకి దేశం ఉదయించాలని ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.



● ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్, శిక్ష(ణ)లో ఉన్న మహిళలే నిర్వాహకులు

77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా...

ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్

కారాగారంలో గడిపే సమయం శిక్ష సమయం కాదు, శిక్షణ సమయం. కారాగారం మానసిక పరివర్తన దిశగా శిక్షణ ఇచ్చే ప్రదేశం. శిక్ష పూర్తయి విడుదలైన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడానికి అవసరమైన నైపుణ్య శిక్షణ కూడా ఇచ్చే ప్రదేశంగా ఉండాలి. అలాగే ఉంటాయి కూడా. అయితే ఈ ఏడాది దేశం మరో అడుగు ముందుకేసింది. శిక్ష అనుభవిస్తున్న మహిళలకు ఉపాధి అవకాశాలను జైలు గోడల మధ్య కాకుండా సమాజంలో కల్పించడం ఈ స్వాతంత్ర్య దినోత్సవం ప్రత్యేకత.

చెన్నై నగర శివారులో అంబత్తూరు– పుఝల్ రోడ్డులో ఉన్న ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు 'ఆల్ ఉమెన్ పెట్రోల్ బంక్' అనే ప్రయోగాత్మకమైన సంస్కరణకు వేదికైంది. పుఝల్ మహిళల కారాగారంలో శిక్ష అనుభవిస్తున్న మహిళల్లో ముప్పై మందికి ఉద్యోగం ఇచ్చింది. దేశంలో ఇదే మొదటి ప్రయత్నం. ఈ ప్రయత్నంతో ఈ పెట్రోల్ బంకు ఫ్రీడమ్ ఫిల్లింగ్ స్టేషన్ అనే గౌరవ సూచికకు అర్హత సాధించింది.

ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పన్నెండు గంటలు మహిళలు విధులు నిర్వర్తిస్తారు. ఆ తర్వాత పురుష ఖైదీలు విధుల్లోకి వస్తారు.

ఖైదీలు తమ శిక్ష కాలం పూర్తయిన తర్వాత సమాజంలో గౌరవంగా జీవించడం కోసం రకరకాల వృత్తుల్లో శిక్షణ ఇస్తారు. అవన్నీ జైలు గోడల మధ్యనే ఉంటాయి. మారుతున్న సమాజానికి తగినట్లు కొత్త కొత్త ఉపాధి మార్గాలకు తగిన ఏర్పాట్లు ఉండవు. అందుబాటులో ఉన్న పనుల్లోనే శిక్షణ ఇవ్వడమే జరిగేది. ఇదిలా ఉంటే... జైళ్లలో మహిళా ఖైదీలకు తగిన సౌకర్యాల పర్యవేక్షణ కోసం అన్ని రాష్ట్రాల్లో పర్యటించిన మహిళా కమిషన్ సభ్యుల పరిశీలనలో కొత్త విషయాలు తెలిశాయి. జైలు గోడల మధ్య ఉండడం వల్ల మహిళలు మానసికంగా కుంగుబాటుకు లోనవుతున్నారని, వారికి సమాజంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించడంతో, ఆ సూచనను అందుకున్న జైలు అధికారుల్లో మొదటగా పుఝల్ జైలు అధికారులు ఈ ప్రయత్నం చేశారు. మహిళలకు పెట్రోల్ పట్టడంలో శిక్షణ ఇవ్వడంతోపాటు వినియోగదారులతో మాట్లాడడం, ఉద్యోగానికి తగిన ప్రవర్తనా నియమావళిలో కూడా మహిళలకు శిక్షణ ఇప్పించారు.

పెట్రోల్ బంకులో విధులు నిర్వర్తిస్తున్న మహిళలు తమకు స్వాతంత్ర్యం వచ్చినట్లు సంతోషిస్తున్నారు. శిక్ష కాలాన్ని ఆనందంగా పూర్తి చేస్తామని, పరిపూర్ణమైన వ్యక్తిత్వంతో సమాజంలోకి విడుదలవుతామని చెప్పారు.

శిక్ష కాలం సమాజంలోనే!

శిక్షణ కాలంలో మారుతున్న కాలానికి అనుగుణంగా సంస్కరణలు తీసుకు రావడంతోపాటు ఖైదీలను సమాజంతో అనుసంధానం చేయడం, వారి పునరావాసం కోసం పని చేయడం కూడా అవసరమే. ఆ అవసరాన్ని గుర్తించి మహిళలతోనే ముందడుగు వేసింది జైళ్ల శాఖ. శిక్ష సమయంలో కూడా సమాజంలో మనుషులతో మాట్లాడుతూ ఉంటే మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. సమాజానికి దూరంగా ఉన్నామనే ఆవేదన దూరమవుతుంది. సమాజంలోనే నివసిస్తున్న భావనతో జీవిస్తారు.

స్వాతంత్ర్యాన్ని ఇలా ఎంజాయ్ చేయండి!

నేటి టెక్నాలజీ యుగంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని హాలిడేగా తీసుకుని ఆనందించే వారే ఎక్కువ. స్కూలు, కాలేజీ విద్యార్థులైతే జెండా వందనం తరువాత ఇంటికెళ్లిపోవచ్చు అని తెగ సంబరపడిపోతుంటారు. కానీ డెబ్బై ఆరేళ్లుగా విరామం లేకుండ జరుపుకొంటూ నేడు 77వ వసంతంలో అడుగు పెట్టాం. దేశాన్ని పాలించే అధికారులు అధికారికంగా ఈ వేడుకలు జరిపిస్తున్నారు. బాధ్యత గల పౌరులుగా మనం ఇలా సెలబ్రేట్ చేసుకుందాం....



● ఉదయాన్నే ఎర్రకోటపై జరిగే జెండావందనం, వివిధ కార్యక్రమాలను టీవీలో చూడాలి. డెబ్బై ఏడేళ్ల స్వాతంత్ర్య భారతం ఎంత ఎత్తుకు ఎదిగిందన్న అంశాలను ప్రత్యక్ష ప్రసారాలు చూడడం ద్వారా తెలుసుకోవచ్చు ● తరువాత ఎప్పటి నుంచో అనుకుంటున్న ప్లేసుకి ఈరోజు వెళ్లండి. ఒక రోజులో వెళ్లిరాగల ప్రాంతానికి వెళ్లి అక్కడ గడిపి మీ ఒత్తిడిని దూరం చేసుకోండి. అక్కడ స్వతంత్ర దినోత్సవాన్ని గుర్తుండిపోయేలా గడపండి. ● రోజూ వేసుకునే దుస్తులు కాకుండా భారతీయ సంప్రదాయం ఉట్టిపడేలాంటి దుస్తులు ధరించండి. వీలైనంత వరకు డ్రెస్‌లో తెలుపు, కాషాయం, ఆకుపచ్చని రంగులు ఉండేలా చూసుకుని వేసుకోవాలి. అప్పుడు త్రివర్ణ పతాకానికి మరింత వన్నె తెచ్చిన వారవుతారు ● ఎక్కడికీ వెళ్లే ఓపిక లేనప్పుడు ఇంట్లోనే ఉండి దేశభక్తి సినిమాలు చూడండి. మీతోపాటు మీ పిల్లలకు మన దేశ చరిత్ర, ఔన్నత్యాలు తెలుస్తాయి ● మరింత ఉత్సాహంగా సెలబ్రేట్ చేసుకోవాలంటే మూడు రంగులు ఉండేలా వెరైటీ డిష్‌లు తయారు చేసుకుని తినండి ● స్వాతంత్ర్య దినోత్సవం అర్థం ఉట్టిపడేలా గాలిపటాలు ఎగరవేయండి. మూడు రంగుల్లో ఉన్న గాలిపటాలను వీలైనంత ఎత్తుకుఎగరేస్తూ మనకొచ్చిన స్వేచ్ఛను ఎంజాయ్ చేయవచ్చు ● పుస్తకాల పురుగులు అయితే దేశభక్తి పుస్తకాలను చదవండి. స్వాతంత్ర్య సమర యోధుల విజయగాథలు, వీరిలో బాగా పాపులర్ అయిన నాయకుల బయోగ్రఫీని చదివి ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చు ● దేశభక్తి గీతాలు వింటూ కూడా సంబరాలు జరుపుకోవచ్చు. అలనాటి పోరాట, అసామాన్య త్యాగాలను గుర్తుచేసే పాటలను వినాలి. లతా మంగేష్కర్, మహ్మద్ రఫీ, ఏఆర్ రెహ్మాన్ పాటలు మనలో నిద్రపోతున్న దేశభక్తిని తట్టి లేపుతాయి ● ఇంటి చుట్టుపక్కల వారు లేదా బంధువులు, కుటుంబ సభ్యులతో దగ్గరలో జరుగుతోన్న జెండా పండుగకు వెళ్లి రెపరెపలాడే త్రివర్ణ పతాకానికి జైహింద్ కొట్టాలి ● దేశానికి పెద్ద సేవ చేయలేక పోయినప్పటికీ మీ చుట్టుపక్కల ఉన్న వారందరికి స్వీట్లు పంచి, నోరు తీపి చేస్తూ స్వతంత్ర దినోత్సవ వేడుకలు జరుపుకోండి.

ప్రతి భారతీయుడికి ఎంతో విలువైన బహుమతులు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు. అందుకే వీలైనంత వరకు అందరితో కలిసి జరుపుకోవాల్సిన జెండా పండుగ ఇది. సెలవు దొరికింది అని సంబరపడిపోక వీటిలో ఏ ఒక్కదాన్ని పాటించినా స్వాతంత్ర్య దినోత్సవాన్ని గౌరవించినట్లే

జీవన సేద్యం!

● పెద్ద కమతాల్లో సేంద్రియ వరి సేద్యంలో జీవన ఎరువులు/పురుగుమందులు కీలకం



● వ్యవసాయ క్షేత్రంలో సిద్ధమవుతున్న జీవన ఎరువులు

సాగుబడి
అశ్లేష కార్తె: ఆగస్టు 17 వరకు
మఖ: 18 నుంచి

సేంద్రియ/ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ద్రావణాలు, కషాయాలను చిన్న, సన్నకారు రైతులు తయారు చేసుకొని వాడగలుగుతున్నారు. అయితే, ఎక్కువ విస్తీర్ణంలో సేంద్రియ/ప్రకృతి సేద్యం చేసే పెద్ద రైతులకు వీటి తయారీ కష్టం కావటంతో జీవన ఎరువులు, జీవన పురుగుమందులను విరివిగా వినియోగిస్తున్నారు. రైతు శాస్త్రవేత్త, తునికిలోని ఏకలవ్య కేవీకే సలహాదారు, హార్ట్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఎం.ఎస్.సుబ్రహ్మణ్యం రాజు గత కొన్ని సంవత్సరాలుగా చిన్న, పెద్ద కమతాల్లో సాగు చేసే రైతులతో కలసి పనిచేస్తున్నారు. ఖరీఫ్/లేటు ఖరీఫ్ వరి సాగులో చిన్న కమతాల రైతులు, పెద్ద కమతాల రైతులు ఏయే ఉత్పాదకాలను, ఎంతెంత మోతాదులో వాడితే మంచి ఫలితాలు వస్తున్నాయన్న అంశాలను ఆయన 'సాక్షి సాగుబడి'కి ఇలా వివరించారు.

వరి నారుమడిని నీరు నిలవని విధంగా తయారు చేసుకోవాలి. విత్తనాన్ని ఒక రోజు ముందు ఎండబెట్టి మరునాడు విత్తన శుద్ధి చేయాలి. నిద్రావస్థ ఉన్న విత్తనాలను, నిద్రావస్థ తొలగించడానికి గోరువెచ్చని నీటిలో నానబెట్టి, అనంతరం విత్తనాలను నారుమడిపై వెదజల్లాలి. 2వ రోజు నీరు బయటకు తీయాలి. 5వ రోజు నీరు పెట్టాలి. తర్వాత తగినంత నీరు ఇస్తుండాలి. చాలా ప్రాంతాల్లో నారు 6 అంగుళాల సైజు నుంచి 10 అంగుళాల సైజు వచ్చినప్పుడు మాత్రమే ఊడ్పు/నాట్లు వేస్తుంటారు. నాట్లు వేసిన 7 రోజులకు.. చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ నాట్లు వేయాలి.

ప్రధాన పొలాన్ని ఊడ్పుకు ముందు 20 రోజుల నుంచి దఫ దఫాలుగా వారానికి ఒకసారి దుక్కి దున్ని, చదును చేసుకోవాలి. ఎకరాకు 3 నుంచి 5 టన్నుల పశువుల ఎరువు వెయ్యాలి. నాట్లతో పాటుగా వివిధ రకాల జీవన ఎరువుల (బ్యాక్టీరియాల)ను ఇవ్వాలి. మొక్కల మధ్య 20 సెం.మీ. దూరం ఉండేలా వరి నాట్లు వేయాలి. మధ్యలో కాలి బాటలు తీయాలి. గట్లపై నువ్వుల విత్తనాలను చల్లుకుంటే నువ్వుల పువ్వులు ఎనాగరస్ అనే కీటకాన్ని ఆకర్షించటం ద్వారా తెల్లదోమ నివారణ జరుగుతుంది.

సేంద్రియ వరి సాగులో చిన్న, పెద్ద రైతులకు అనువైన ఉత్పాదకాల పట్టిక

వివరణ	చిన్న రైతులకు అనువైన ప్రాచీన పద్ధతులు	పెద్ద రైతులకు అనువైన ఆధునిక పద్ధతులు
1వ రోజు విత్తనశుద్ధి	బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి	హ్యూమిక్ యాసిడ్, బవేరియా, మెటారైజియం, సూడోమోనాస్
10వ రోజు పిచికారీ	జీవామృతం + పంచగవ్య + పుల్ల మజ్జిగ	మీనామృతం + సూడోమోనాస్+ తౌడు కషాయం
12వ రోజు ఎరువు	ఘనజీవామృతం	ఘనజీవామృతం / వర్మీకంపోస్టు + హ్యూమిక్ ఆసిడ్
20వ రోజు సస్యరక్షణ	ఆగ్నేయ అస్త్రం + జీవామృతం + మొలకల ద్రావణం	మీనామృతం + బేవేరియా, మెటారైజియం + వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
ఊడ్పు అనంతరం 22వ రోజు స్ప్రే	పంచగవ్య + అగ్ని అస్త్రం + పుల్ల మజ్జిగ	మీనామృతం+బవేరియా +మెటారైజియం+ వెర్టిసీలియం + కొబ్బరి నీరు పిచికారీ చేయాలి. కాండం తొలిచే పురుగుకు ల్యూర్ పెట్టాలి లేదా ట్రైకోగ్రామా కార్డులు పెట్టాలి లేదా తూజా 200 (హోమియో) పిచికారీ చేయాలి.
25వ రోజు ఊడ్పు	ఘనజీవామృతం 1 టన్ను / 1 ఎకరం + వేప పిండి 200 కిలోలు/ఎకరం	ఘనజీవామృతం 1 టన్ను/ 1ఎ + బ్యాక్టీరియాలు, ఎన్‌పికె, బవేరియా, మెటారైజియం బాక్టీరియాలు.
25 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
35 రోజులకు	మొలకల ద్రావణం + ఆగ్నేయ అస్త్రం + ఇంగువ కషాయం లేదా పుల్ల మజ్జిగ పిచికారీ చేయాలి.	మీనామృతం, సోయాజిన్, పెసలు మొలకల ద్రావణం, సూడోమోనాస్, బవేరియా, మెటారైజియం, వెర్టిసీలియం పిచికారీ చేయాలి.
40 రోజులకు	కలుపు తీయాలి.	కలుపు తీయాలి.
45 రోజులకు	మొలకల ద్రావణం + వేప గింజల కషాయం	మీనామృతం + నేల వేము కషాయం + ఉలవల కషాయం
45 రోజులకు	ఘనజీవామృతం 500 కిలోలు/1 ఎకరం	ఘనజీవామృతం 500 కిలోలు / 1 ఎకరం
65వ రోజు పిచికారి	మొలకల ద్రావణం + ఇంగువ కషాయం + పసుపు దుంపల కషాయం + ఆగ్నేయ అస్త్రం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + వావిలాకు కషాయం
80వ రోజు పిచికారీ	మొలకల ద్రావణం + పుల్ల మజ్జిగ + దశపర్ణి కషాయం	మీనామృతం + సూడోమోనాస్ + వెర్టిసీలియం + బవేరియా



● జీవామృతం

మోతాదు ఎంత?

● ఎకరం పంటకు సగటున 100-120 లీ. నీటిని పిచికారీ చేయాలి ● మీనామృతాన్ని నారుమడిపై లీ. నీటికి 5 ఎం.ఎల్., పైరు ఎదిగిన దశలో లీ. నీటికి / 10ఎం.ఎల్. చొప్పున కలిపి పిచికారీ చేయాలి ● బవేరియాను లీ. నీటికి /10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి ● మెటారైజమ్ లీ. నీటికి/10 గ్రా. వాడాలి ● హ్యూమిక్ యాసిడ్ కిలో విత్తనాలకు/10 గ్రా. వాడాలి. ● కిలో నేల వేము పొడిని 100 లీ. నీటిలో కలిపి కషాయం తయారు చేయాలి ● 1500 గ్రా. వావిలాకు పొడిని కషాయం చేసుకొని 100 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● ఎకరానికి రకానికి ఒక కిలో చొప్పున జీవన ఎరువులు వాడాలి ● లీ. నీటికి 10 ఎం.ఎల్. కొబ్బరి నీరు కలపాలి ● పంచగవ్య నారుమడిలో పిచికారీకి లీ. నీటికి 5 ఎం.ఎల్. కలపాలి. పైరు ఎదిగే దశలో పిచికారీకి లీ. నీటికి 20 ఎం.ఎల్. కలపాలి ● అర కేజీ ఇంగువతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి ● 200 గ్రా. పసుపును కషాయం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 2 కిలోల మొలకలతో ద్రావణం చేసుకొని వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేసుకోవాలి ● 6 లీ. పుల్ల మజ్జిగను వంద లీ. నీటితో కలిపి పిచికారీ చేయాలి. ● ఆగ్నేయ అస్త్రం తయారీలో మిర్చి, అల్లం, వెల్లుల్లిలను అర కిలో చొప్పున తీసుకొని నూరి కషాయం తయారు చేసి వంద లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

(ఇతర వివరాలకు.. సుబ్రహ్మణ్యం రాజు మొబైల్: 76598 55588)

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

ఎడారిలో ఆశల మొలక



● థార్ ఎడారిలో సాగవుతున్న మొలకగడ్డి

ప్రపంచంలోనే అత్యధిక పాలను ఉత్పత్తి చేస్తున్న మన దేశంలో పచ్చిగడ్డి లభ్యత 11 శాతం తక్కువగా ఉందని భారతీయ గడ్డి నేలలు, పశుగ్రాస పరిశోధనా సంస్థ లెక్కగట్టింది. భూతాపం ప్రమాదకరమైన రీతిలో పెరుగుతున్న ప్రస్తుత కాలంలో పచ్చిగడ్డి సాగుకు హైడ్రోపోనిక్స్ పద్ధతి చక్కని ప్రత్యామ్నాయంగా మారుతోంది. ఈ పద్ధతిలో తక్కువ స్థలంలో, పది శాతం నీటితోనే ఏడాది పొడవునా మొలక గడ్డిని పెంచుకోవచ్చు. మొలక గడ్డిని పాడి ఆవులు, గొర్రెలు, మేకలకు మేపటం మన రాష్ట్రాల్లోనే కాదు.. రాజస్థాన్‌లోని థార్ ఎడారి ప్రాంత పశుపోషకులను సైతం ఆకర్షిస్తోంది. అక్కడ ఏడాదిలో రెండు నెలలే వర్షం పడుతుంది. మండు వేసవిలో ఎండ వేడి 120 డిగ్రీల సెల్షియస్‌కు చేరుతుంటుంది. అటువంటి క్లిష్ట పరిస్థితుల్లో జీవించే థార్ ప్రాంత రైతులు, సంచార పశుపోషకులు స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌ల తోడ్పాటుతో ఇటీవల హైడ్రోపోనిక్ మొలక గడ్డి సాగు చేపట్టారు. సునాయాసంగా నాణ్యమైన పాల దిగుబడితో పాటు ఆదాయాన్ని పెంచుకుంటున్నారు.



● మొలకగడ్డి వేస్తున్న మహిళారైతు పలు హేమారామ్

స్వచ్ఛంద సంస్థలు, స్టార్టప్‌లు ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకుల కోసం హైడ్రోపోనిక్ మొలక గడ్డిని పెంచే షెడ్లను నెలకొల్పుతున్నాయి. రైతులే వాటిలో మొక్కజొన్నలు, గోధుమలను నానబెట్టి, వర్టికల్ గార్డెన్ మాదిరిగా అనేక దొంతర్లలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ ట్రేలలో మొలక గడ్డిని పెంచుతున్నారు. సాధారణంగా పొలంలో పచ్చిగడ్డిని పెంచడానికి 2 నెలలు పడుతుంది. మొలక గడ్డి 8 రోజుల్లో పెరుగుతుంది. ముఖ్యంగా పది శాతం నీటితోనే ఈ గడ్డి పెరగటం థార్ ఎడారి ప్రాంత రైతులు, పశుపోషకులకు ఉపయుక్తంగా మారింది.

స్వచ్ఛంద సంస్థ ఉర్ముల్ సీమంత్ సమితి, డిజర్ట్ రిసోర్స్ సెంటర్‌తో కలసి హైడ్రోగ్రీన్స్, బహుళ నేచురల్స్ స్టార్టప్‌లు మొలక గడ్డి ఉత్పత్తి యూనిట్లను థార్ ఎడారి గ్రామాల్లో ఏర్పాటు చేస్తుండటంతో కొందరు మహిళా రైతులు హాయిగా ఊపిరిపీల్చుకుంటున్నారు. బహుళ నేచురల్స్ వీరి వద్ద నుంచి దేశీ ఆవు పాలను, ఒంటె పాలను సేకరించి, విలువ జోడించి ఆన్‌లైన్‌లో విక్రయిస్తోంది. వెయ్యి మంది పాడి రైతులు, 4 వేల మంది పశుపోషకులు తమ ఆవులు, మేకలకు మొలక గడ్డిని మేపుకుంటూ ఏడాది పొడవునా స్థిరమైన ఆదాయం పొందుతున్నారు.

పశుపోషణ కోసం గొడ్డు చాకిరీ చేసే మహిళా రైతులకు మొలక గడ్డి అందుబాటులోకి రావటం గొప్ప ఊరటనిస్తోంది. మొలక గడ్డి మేపుతో దేశీ ఆవు పాల దిగుబడి మూడింట ఒక వంతు పెరగడంతో పాటు, నాణ్యత కూడా పెరిగిందని రాజస్థాన్‌లోని ఘంటియాలి గ్రామానికి చెందిన దళిత మహిళా పశుపోషకురాలు 'పలు', ఆమె భర్త హేమారామ్ సంతోషంగా చెబుతున్నారు. వీరికి 8 ఆవులు, మేకలు ఉన్నాయి. 4 మైళ్ల దూరంలో ఉన్న పొలానికి వెళ్లి గడ్డి కోసుకొని, ఎండలో నెత్తిన పెట్టుకొని మోసుకు రావటం ఆమెకు కనాకష్టంగా ఉండేది. రెండేళ్ల క్రితం ఇంటి పక్కనే మొలకగడ్డి ఉత్పత్తి యూనిట్‌ను ఏర్పాటు చేసుకున్నాక ఆ బాధ తప్పింది. మిగులు గడ్డిని, గోధుమ గడ్డి పొడిని అమ్ముతూ ఆదాయం పొందుతుండటం విశేషం.

దూడలకు పెట్టే కాన్సంట్రేట్ మిక్చర్ దాణాను 75% తగ్గించి మొక్కజొన్న మొలక గడ్డిని మేపటం వల్ల మంచి ఫలితం కనిపించిందని బికనెర్ వెటరినరీ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.కె. ధురియా అన్నారు. హైడ్రోపోనిక్ మొలక గడ్డి వల్ల మేకల్లో జీర్ణశక్తి, పెరుగుదల బాగుందని సౌదీ అరేబియాలోని కింగ్ సౌద్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడైంది. మొలకగడ్డి యూనిట్ ఏర్పాటుకు రూ. 18 లక్షల నుంచి 25 లక్షల వరకు ఖర్చవుతోంది. అయితే, ఇసుక తుపాన్లకు మొలకగడ్డి షెడ్లు దెబ్బతినటం వల్ల నష్టం జరుగుతోంది.

అందుకని, ముస్ముందు షిప్పింగ్ కంటెయినర్లలో మొలకగడ్డి ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేయటమే దీనికి పరిష్కారమని బహుళ నేచురల్స్ భావిస్తోంది. లక్షల ఖర్చుతో కూడిన పని కావటంతో రైతులను బృందాలుగా ఏర్పాటు చేసి మొలకగడ్డి యూనిట్లను నెలకొల్పితే మేలు. అయితే, రూ. 17.500 ఖర్చుతో చిన్నపాటి మొలకగడ్డి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చని హైడ్రోగ్రీన్స్ స్టార్టప్ చెబుతోంది.

బయోచార్‌తో సేంద్రియ ఇంటిపంటల సాగుపై శిక్షణ

సేంద్రియ ఇంటిపంటల సాగుపై పట్టణ/నగర వాసులపై ఆసక్తి పెరుగుతోంది. బయోచార్ (బొగ్గుపొడి) కలిపిన మట్టి మిశ్రమంతో టెర్రస్ గార్డెన్లు, పెరటి తోటలు, బాల్కనీలలో కూరగాయల పెంపకంపై ఈ నెల 24, 25 తేదీల్లో హైదరాబాద్ మలకోపేటలోని న్యూలైఫ్ ఫౌండేషన్ శిక్షణ ఇవ్వనుంది. మిగులు పంట దిగుబడులను సోలార్ డ్రయ్యర్‌తో ఎండబెట్టే విధానం కూడా వివరిస్తామని న్యూలైఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ షిండే తెలిపారు. వివరాలకు.. 81210 08002.

17న అమలాపురంలో ప్రకృతి సేద్యంపై శిక్షణ

శ్రీనివాస సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 17న కోనసీమ జిల్లా అమలాపురంలోని (ముక్తేశ్వరం- కొత్తపేట రోడ్డు) శ్రీసత్యనారాయణ గార్డెన్స్‌లో ప్రకృతి వ్యవసాయంపై నిపుణులు విజయరామ్ రైతులకు అవగాహన కల్పిస్తారని నిర్వాహకులు నిమ్మకాయల సత్యనారాయణ తెలిపారు. ప్రవేశం ఉచితం. ముందుగా పేరు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 64091 11427 (సా. 3 గం. నుంచి 6 గం. వరకు మాత్రమే).